## క్లుప్తంగా

### సభను విజయవంతం చేయాలి

చిన్నచింతకుంట: మండలంలో ఆదివారం బీడీ కార్మికుల సమస్యలపై టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు యాదగిరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.

### సమావేశానికి తరలిన నాయకులు

గండేడ్/మహమ్మదాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పరిగిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి గండేడ్, మహమ్మదాబాద్ మండలాల నాయకులు తరలివెళ్లారు. పార్టీ అధ్యక్షులు పెంట్యానాయక్, భిక్షపతిల ఆధ్వర్యంలో కార్యకర్తలు బయలుదేరారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో సమావేశంలో పాల్గొన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నగరిగారి ప్రీతంను శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణం అధ్యక్షుడు ఏర్పుల నాగరాజు, దేవరకద్ర మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాములు, వార్డు సభ్యులు రామస్వామి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం పరిశీలన



హన్వాడ: వేపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం తహసీల్దార్ కిష్ట్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. స్వయంగా భోజనం వడ్డించారు. సిబ్బందికి నాణ్యతపై పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం దేవిజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటు వినియోగంపై అవగాహన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో విద్యార్థులకు ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ లియాఖత్ ఆలీ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు రామకృష్ణరావు, భాస్కరయ్య, రామకృష్ణ, రఫియా, ఆయేషా సుల్తానా, సుధాకర్‌రెడ్డి, విశ్వనాథ్, గణేష్, రోహిణి పాల్గొన్నారు.

### అవగాహన అవసరం

పాలమూరు: మోకాళ్ల అరుగుదలపై అవగాహన లేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారని, ప్రతి ఒక్కరికి సర్జరీ, మోకాళ్ల మార్పిడీ అవసరం ఉండదని యశోద ఆస్పత్రి డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు.

### విగ్రహాలను శుద్ధి చేసిన సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో భాగంగా శనివారం స్థానిక బస్టాండు సమీపంలోని అంబేడ్కర్, రాజీవ్ సర్కిల్ వద్ద ఉన్న గాంధీజీ, పాల్కొండచౌరస్తాలోని ఛత్రపతి శివాజీ విగ్రహాలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. అలాగే ఆయా వార్డులలోని స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను సైతం నీటితో కడిగి పరిశుభ్రంగా ఉంచారు. కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



# అవగాహనతోనే అడ్డుకట్ట

- రోజురోజుకూ పెరుగుతున్న క్షయ రోగులు
- చిన్నారులను కలవరపెడుతున్న మహమ్మారి
- క్షేత్రస్థాయిలో కొరవడిన అవగాహన
- జిల్లాలో కొనసాగుతున్న గుర్తింపు సర్వే
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం



పోస్టర్లను ఆవిష్కరించిన అధికారులు

పాలమూరు: క్షయ నివారణ కట్టడి కోసం జిల్లా అధికారులు ఒకవైపు ప్రయత్నం చేస్తున్నా.. మరోవైపు రోగులు క్రమంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కాలంలో చిన్నారుల్లోనూ ఈ వ్యాధి అధికంగా కనిపిస్తోంది. ఏడాది కేటాయించిన లక్ష్యంలో భాగంగా బాధితులను గుర్తించడానికి ప్రత్యేక సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఓవైపు ప్రభుత్వం క్షయ నివారణకు వైద్య సేవలు విస్తరిస్తున్నా.. క్షేత్రస్థాయిలో వ్యాధి, చికిత్స విధానాలపై అవగాహన లేకపోవడంతో కొత్తగా రోగులు పెరుగుతున్నారు.

- జిల్లాలో గతేడాది 2023లో గుర్తించిన రోగులు 1,814 ఉండగా ఈ ఏడాది కొత్తగా 544 మందిని గుర్తించారు. ఇందులో బాదేపల్లి యూనిట్ పరిధిలో 81, భూత్పూర్‌లో 93, కోయిలకొండలో 103, మహబూబ్‌నగర్ యూనిట్ పరిధిలో 167 మంది రోగులు ఉన్నారు.

#### ఎలా వస్తుందంటే..

క్షయ ఒక అంటు వ్యాధి.. మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే సూక్ష్మజీవి ద్వారా సంక్రమిస్తుంది. ఈ వ్యాధితో బాధపడే వారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు టీబీ క్రిములు సన్నని తుంపర్ల ద్వారా గాలిలోకి వ్యాపిస్తాయి. ఈ తుంపర్లను ఇతరులు పీల్చినప్పుడు వారికి సోకుతుంది. హెచ్‌ఐవీ బాధితులకు ఇది చాలా త్వరగా వచ్చే అవకాశం ఉంది. ఇది వెంట్రుకలు, గోళ్లు, తప్ప మిగిలిన అన్ని అవయవాల్లోనూ నివసించే ప్రమాదకరమైన సూక్ష్మ క్రిమి. సాధారణంగా వ్యాధికారక క్రిమి 90 శాతం మందిలో క్రియా రహితంగా ఉంటుంది. పొగ, మద్యపాన ప్రియులు, హెచ్‌ఐవీ బాధితులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలో రోగ నిరోధక శక్తి బలహీనంగా ఉన్నప్పుడు వ్యాధి ప్రబలుతుంది. క్షయ వ్యాధి ఊపిరితిత్తులే కాదు శరీరంలోని ప్రతి అవయవానికి సోకుతుంది.

#### గుర్తించడం ఇలా..

రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, దగ్గినప్పుడు రక్తం పడటం వంటివి టీబీ వ్యాధి లక్షణాలు. సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్తే ఉచితంగా తెమడ పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారిస్తారు.

#### నిబంధనలు పాటించని ప్రైవేట్ వైద్యులు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యులు క్షయ బాధితులను గుర్తిస్తే వారి వివరాలు ప్రతినెలా క్షయ నియంత్రణ శాఖకు అందించాలి. ఒక కేసును గుర్తిస్తే ప్రభుత్వం ఆ వైద్యుడికి రూ.100 ప్రోత్సాహక నగదు అందజేస్తుంది. బాధితుడికి ఐదు నెలల పాటు పూర్తి స్థాయిలో చికిత్స అందిస్తే రూ.500 అందిస్తోంది. అయినా ప్రైవేట్ వైద్యులు వివరాలు అందించడం లేదు. ప్రైవేట్‌లో చికిత్స తీసుకోకపోవడంతో అది వారి నుంచి ఇతరులకు సోకి మరింతగా ప్రబలుతోంది. బాధితుల వివరాలన్నీ ఈ శాఖ వద్ద ఉంటే సిబ్బంది ఆ రోగుల వివరాల మేరకు చికిత్స తీసుకుంటున్నారా.. లేదా.. అనే విషయాలను పర్యవేక్షించి వ్యాధి నివారణకు కృషి చేయడానికి వీలవుతుంది.

#### అవగాహన కల్పిస్తున్నాం..



ఇటీవల జిల్లాలో షుగర్ రోగులకు టీబీ అధికంగా వస్తోంది. పొగ తాగే పురుషులలో, ఆడ వారిలో గర్భసంచి, మెడ చుట్టూ గడ్డలు అధికంగా అవుతూ టీబీ సోకుతుంది. దేశంలో 2025 నాటికి టీబీని పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా ఉన్న అనుకున్న ఫలితాలు సాధించడంలో విఫయమయ్యాం. క్షేత్రస్థాయిలో సరైన అవగాహన లేక రోగులు పెరుగుతున్నారు. రెండు వారాల పాటు దగ్గు, జ్వరం వస్తే తప్పక తెమడ పరీక్ష, ఎక్స్‌రే తీయించి వైద్యుడికి చూపించాలి. లక్షణాలు ఉన్నవారు త్వరగా నిర్ధారణ చేసుకోకపోవడం వల్ల సమస్య పెరుగుతుంది. టీబీ సోకిన వారు 6–9 నెలల పాటు మందులు వాడాలి. కానీ, కొందరు మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇలా చేయడం వల్ల టీబీ నిర్ధారణ చేసే గడువు పెరిగిపోయి.. ఇంట్లో ఉండే ఇతర కుటుంబ సభ్యులకు కూడా వచ్చే అవకాశం ఉంది.

– శ్రీనివాస్‌రెడ్డి, పల్మనాలజిస్ట్

## ఆదిబసవేశ్వరుడి జాతరకు వేళాయె



ఆదిబసవేశ్వరుడు

నవాబుపేట: మండలపరిధిలో వెలసిన స్వయం భూ ఆదిబసవేశ్వర స్వామి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో పల్లె గడ్డ గ్రామశివారులో వెలిసిన స్వామి కోరిన కొర్కెలు తీర్చే కొంగు బంగారంగా విలసిల్లుతున్నాడు. ఇక్కడా ఏటా హోలీకి ముందు రోజు ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. ఈ సారి ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా 24న ప్రభోత్సవం, 25న రథోత్సవం, 26న శకటోత్సవం, 27న అగ్నిగుండం, 28న శివపార్వతుల కల్యాణం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ పూజారి శ్రీశైలం, కార్యక్రమ నిర్వాహకులు జంగయ్య, రాజలింగం తెలిపారు.

#### ఆలయ చరిత్ర..

పూర్వం ఒక రైతు ప్రస్తుతం ఆలయం ఉన్న తన పొలం దున్నుతుండగా.. గుంటుక పలుగుకు ఒక రాయి తగిలిందని దాన్ని తొలగించి పొలం గట్టున వేశాడు. కాగా మరుసటి రోజు ఆ రాయి తిరిగి యధాస్థానంలోకి వచ్చింది. దీంతో రైతు గ్రామస్తులకు విషయం వివరించాడు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు మరుసటి రోజు మరోసారి రాయిని తొలగించి పొలం గట్టున వేశారు. అప్పుడు కూడా రాయి తిరిగి యధాస్థానికి చేరింది. దీంతో అందరు ఆ రాయిలో ఏదో మహిమ ఉందని దాన్ని అక్కడే ఉంచి పూజలు చేశారని స్థానికులు చెబుతుంటారు. కాగా కాల క్రమేనా ఆ రాయి నంది ఆకారంలోకి మారటం .. ఏటా విగ్రహం పెరుగుతూ రావటంతో మహిమ గల దేవుడని ఆది బసవేశ్వరుడిగా స్వామిని కొలుస్తున్నారని తెలుస్తోంది.

## మందకృష్ణపై విమర్శలు సరికావు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మాదిగల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న మంద కృష్ణ మాదిగపై కాంగ్రెస్ నాయకుడు సంపత్‌కుమార్ విమర్శలు చేయడం సరికాదని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తిక్ పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను సంపత్‌కుమార్‌కు కేటాయించాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారన్నారు. కానీ రేవంత్‌రెడ్డి సంపత్‌కుమార్‌తో ప్రెస్‌మీట్ పెట్టించి మందకృష్ణ విమర్శించేలా చేశారని వివరించారు. సంపత్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీసాల గణేష్, కమలాకర్, నరసింహ, రవితేజ, రాకేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## 11 మందిపై చీటింగ్ కేసు నమోదు

బాలానగర్: ఇతరుల భూమిని తమదిగా చూపించేలా పత్రాలు తయారు చేసి స్వాధీనం చేసుకున్న కేసులో కోర్టు తీర్పుతో 11 మందిపై చీటింగ్ కేసునమోదైంది. ఎస్‌ఐ తిరుపాజీ తెలిపిన వివరాలు ఇలా.. వీరన్నపల్లికి చెందిన చెందిన నర్సిములు, భీమయ్య, నర్సింలు, మానయ్య, నారాయణ, లింగయ్య, రమేష్, శ్రీనివాస్, సుధాకర్, నర్సింలు, దామోదర్ ఇతరులకు చెందిన భూమికి వారసులుగా చూపి పత్రాలు తయారు చేసుకున్నారు. ఈ మేరకు భూమిని వినియోగిస్తున్నారు. కాగా రాజేందర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో విషయం కోర్టుకు చేరింది.

## మద్యం పట్టివేత : వ్యక్తిపై కేసు

మహమ్మదాబాద్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై మహమ్మదాబాద్ పోలీసులు శనివారం కేసునమోదు చేశారు. వెన్నాచేడ్ గ్రామానికి చెందిన అంజిలయ్య నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్నాడని తమకు సమాచారం అందినట్లు పోలీసులు వివరించారు. ఈ మేరకు అంజిలయ్య ఇంటికి చేరుకొని తనిఖీలు చేయగా మద్యం పట్టుపడినట్లు వివరించారు. దీంతో సీజ్ చేసి పోలీస్ స్టేషనకు తరలించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. అంజిలయ్యపై కేసు నమోదు చేశామని వివరించారు. గ్రామంలోని మిగతా బెల్టు షాపుల్లోనూ తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## విధులకు ఆటంకం : వ్యక్తికి రిమాండ్

రాజాపూర్: విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసునమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు రాజాపూర్ ఎస్‌ఐ రవి తెలిపారు. మల్లేపల్లిపరిధిలోని సోమ్లాతండాకు చెందిన విశ్వనాథ్ రాత్రి 9: 30 గంటలకు డయల్ 100కు ఫోన్ చేసి తన ఆస్తికి నష్టం కల్గిస్తున్నారని చెప్పినట్లు వివరించారు. కాగా అక్కడికి చేరుకున్న హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్, హోమ్ గార్డు శ్రీనివాస్ వివరాలు సేకరిస్తుండగా దురుసుగా ప్రవర్తించాడని అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

## యువకుడు అదృశ్యం

రాజాపూర్: చొక్కంపేట్‌కి చెందిన యాదయ్య గత మంగళవారం రాత్రి ఇంటి నుంచి గ్రామంలోకి వెళ్లి వస్తానని ఎక్కడికో వెళ్లిపోయాడు. కాగా కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతకగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తండ్రి పెంటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి వివరించారు.

## తిరుమలాపూర్‌లో యువతి ..

రాజాపూర్: తిరుమలాపూర్‌కి చెందిన ఓ యువతిని కనిపించకుండా పోవడంతో పోలీసులు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సదరు యువతికి గ్రామానికి చెందిన వ్యక్తితో గత ఏడాది వివాహం చేశారు. కాగా ఈనెల 21న ఆమె తల్లిదండ్రుల వద్దకు వచ్చి తిరిగి వెళ్లలేదు. దీంతో యువతి భర్త విషయాన్ని ఆమె తండ్రికి తెలియజేశారు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మిస్సింగ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

బాలానగర్: నందారం మాజీ సర్పంచ్ మొల్గర నిర్మల మామ నాగయ్య ఇటీవలే మృతి చెందారు. అదేవిధంగా చిన్నరేవల్లిలో మాజీ సర్పంచ్ లక్ష్మి బావ శ్రీశైలం మృతిచెందారు. ఈ మేరకు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శనివారం పరామర్శించారు. ఉమాకాంత్, చంద్రమౌళి, శ్రీనివాస్‌రావు, వెంకట్‌రాములు గౌడ్ ఉన్నారు.

# ముగిసిన పోషణ పక్షోత్సవాలు



మాచారం కేంద్రంలో పప్పులు, కూరగాయలతో పక్షోత్సవ చిహ్నం



మున్సిపాలిటి పరిధిలోని కుమ్మరివాడకేంద్రంలో..

జడ్చర్ల టౌన్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ పక్వాడ పక్షోత్సవాలు శనివారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా మండలంలోని మాచారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ మెహరున్నీసాబేగం పాల్గొని పక్షోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. ఆకుకూరలు, పండ్లు, పాలు, కూరగాయలు, గుడ్లు, మంచినీళ్లు, అయోడిన్ ఉప్పు తీసుకోవాలని చిరుధాన్యాలు తీసుకోవటం వల్ల పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. సూపర్‌వైజర్ సుగుణ, వైద్య సిబ్బంది మాధురి, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. మున్సిపాలిటి పరిధిలోని కుమ్మరివాడ కేంద్రంలోనూ పక్షోత్సవ ముగింపు నిర్వహించారు.

# అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చేస్తాం



క్రిష్టియన్‌పల్లి శివారులో ఇళ్లనిర్మాణాలకు పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్

మహబూబ్‌నగర్ రూరల్: అర్బన్ మండలంలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని తహసీల్దార్ ఘన్సీరామ్ హెచ్చరించారు. శనివారం క్రిష్టియన్‌పల్లి శివారులోని సర్వే నంబర్ 523లో ఇళ్ల నిర్మాణాలను గిర్దావర్లు నర్సింగ్, సుదర్శన్‌రెడ్డిలతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణం చేపడుతున్న స్థలాలపై విచారణ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్బన్ మండలంలో సర్వేనంబర్లు 523, 227, 25 ప్రభుత్వ భూములకు సంబంధించినవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో నిర్మించుకున్న ఇళ్లపై కూడా విచారణ చేపడతామని తెలిపారు.

# 'గాలి కుంటు'తో పశువులకు ఇబ్బందులు



టీకాలు ఇస్తున్న జీవీపీ మంగమ్మ

గండేడ్: గాలికుంటు వ్యాధితో పశువులకు ఇబ్బందులు కలుగుతాయని జీవీఓ మంగమ్మ పేర్కొన్నారు. శనివారం వెన్నాచేడ్‌లో వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా రైతులకు సూచనలు చేశారు. వేసవి ప్రారంభంలో పశువులకు గాలికుంటు సోకుతుందన్నారు. దీని కారణంగా పశువులు మేత సరిగా తినవని తెలిపారు. కోలుకోవడానికి సమయం పడుతుందని వివరించారు. అందువల్ల ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని సూచించారు.

# అమర వీరులకు నివాళి



నవాబుపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో శనివారం రాత్రి అమర వీరులను స్మరిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు నివాళి అర్పించారు. సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి సీహెచ్ రాంచందర్, మండల కార్యదర్శి సాంబశివుడు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రవీంద్ర యువజన సంఘం నాయకులు, లింగంపల్లిలో భగత్‌సింగ్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేద్దామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుతీ, సీతారాం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని శెట్టి కాంప్లెక్స్ వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాకేశ్, అజయ్, చిన్న కేశవులు, తారక్, నవీన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## నగదు పట్టివేత

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వేరు వేరు వ్యక్తుల నుంచి మొత్తం రూ. 1,21,600 నగదును పోలీసులు శనివారం పట్టుకున్నారు. గద్వాల్ జిల్లా మద్దెలబండకు చెందిన కుర్వ నర్సింలు నుంచి రూ. 70వేలు, చింతలకుంటకు చెందిన నరేష్ కుమార్ గుప్త నుంచి రూ. 51,600 ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ తిరుపాజీ, సిబ్బంది గోపాల్, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇసుక డంప్ సీజ్



బాలానగర్: అనుమతి లేకుండా ఓ వెంచర్‌లో డంప్ చేసిన సుమారు 5 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మంగళవారం సదరు ఇసుకను వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## ఆర్థికసాయం

దేవరకద్ర: కోయిల్‌సాగర్‌కి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఇరగోటి రాములు శనివారం మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి తన వంతుగా రూ. 5 వేలు అందించారు. గ్రామ అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

**ఉద్యోగి కుటుంబానికి..**

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో నాన్‌టీచింగ్ ఉద్యోగిగా పనిచేసి అనారోగ్యంతో మరణించిన సత్యనారాయణ కుటుంబానికి వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశారు. ఈమేరకు గతంలో ఉద్యోగి మరణిస్తే కేవలం రూ. లక్ష మాత్రమే ఇస్తుండగా.. ఇటీవలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో దాన్ని రూ.3.50 లక్షలకు పెంచారు. కాగా పెంచిన మొత్తాన్ని సత్యనారాయణ కుటుంబానికి అందజేశారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ఏఆర్ వెంకటేశ్వర్లు, సూపరిండెంట్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు నివారణకు సహకరించాలి



శిబిరంలో సూచనలు చేస్తున్న జిల్లా అధికారి జరీనాబేగం

నవాబుపేట: కుష్టు రహిత భారత్ లక్ష్యంగా కొనసాగుతున్న కార్యక్రమాల్లో అందరు పాల్గొని సహకరించాలని.. జిల్లా లెప్రసీ ప్రోగ్రాం అధికారి జరీనాబేగం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. వారం రోజుల పాటు జరిగే స్పెషల్ డ్రైవ్‌లో అందరు పాల్గొనాలని వివరించారు. మండల వైద్యాధికారి నవీన్‌చంద్ర, సిబ్బంది శరభలింగం, కమలమ్మ, శ్రీనివాస్, మమత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బైక్ - కారు ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

మిడ్జిల్: రాణిపేట్ సమీపంలో శనివారం ఉదయం బైక్‌ను కారు ఢీకొట్టడంతో దానిపై ఉన్న వల్లభరావుపల్లికి చెందిన క్యాతపోగు వెంకటేష్ , చెనిగపోగు రామస్వామి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

# కేంద్రీయ విద్యాలయ కమిటీ సమావేశం



పుస్తకాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయ కమిటీ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూస్ లెటర్ ప్రైమరీ యాక్టివిటీ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అటల్ ల్యాబ్‌ను ఆయన సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంవీఎస్ ప్రిన్సిపాల్ పద్మావతి, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.